1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
మంగళవారం | జులై 02, 2024 | www.navatelangana.com

జిల్లాలో పోలీసు యాక్ట్ అమలు

ఎస్‌పి సిహెచ్. సింధు శర్మా


ఎస్పీ సింధు శర్మ

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని (జులై 1వ తేది నుండి 07 వ తేదీ వరకు) జిల్లా వ్యాప్తం గా 30, 30(ఎ) పోలీసు యాక్ట్ 1861 అమలులో ఉంటుందని కామారెడ్డి జిల్లా ఎస్.పి. సిహెచ్.సింధు శర్మా సోమవారం తెలిపారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా జిల్లా ప్రజలు ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలిలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని పేర్కొన్నారు. అలాగే ప్రజా ధనాన్ని నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని ఎస్.పి. హెచ్చరించారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు తమకు ఈ విషయంలో సహకరించాలని తెలిపారు.

గుమ్మడి ఫౌండేషన్‌కు రూ.20 వేల ఆర్థికసాయం



నవతెలంగాణ-కోటగిరి

కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలం లాడేగావ్ గ్రామానికి చెందిన రిటైర్డ్ విఆర్‌ఓ శంకర్‌రావు మారుతీ రావు పటేల్ సోమవారం కోటగిరి మండలంలోని ఎక్లాస్పూర్ గ్రామంలో గుమ్మడి ఫౌండేషన్ అనాథాశ్రమానికి తన వంతు సహాయంగా రూ.20,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఫౌండేషన్ నిర్వాహకులు శ్రీధర్ వారి దంపతులు శంకర్రావు పటేల్ దంపతులను సన్మానించారు. వారు చేసిన ఆర్థిక సహాయం మరవలేదన్నారు. తన కుమారుని పేరిట అనాథాశ్రమం నెలకొల్పినట్లు శ్రీధర్ తెలిపారు.


తెరుచుకున్న బాబ్లీప్రాజెక్టు గేట్లు.. హాజరైన ఇరు రాష్ట్రాల అధికారులు



బాబ్లీగేట్లు ఎత్తివేతతో
గోదావరికి జలకళ

- ఇరు రాష్ట్రాల అధికారుల సమక్షంలో తెరుచున్న బాబ్లీ గేట్లు

నవతెలంగాణ-నిజామాబాద్ డెస్క్/రెంజల్

ఉత్తర తెలంగాణ వర ప్రదాయిని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎగువ భాగంలో మహారాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన బాబ్లీప్రాజెక్టు గేట్లు సోమవారం తెరుచుకున్నాయి. ఇరు రాష్ట్రాల అధికారుల సమక్షంలో ఉదయం 11 గంటల సమయంలో మొత్తం 14 గేట్లను ఎత్తివేశారు. గేట్లను ఎత్తివేసే సమయంలో బాబ్లీ ప్రాజెక్టులో 0.2 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు.

సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ప్రతేడాది వర్షాకాలం ప్రారంభమైన జులై 1వ తేదీ నుంచి బాబ్లీగేట్లను తెరిచి ఉంచనున్నారు. అనంతరం అక్టోబర్ 28వ తేదీనా మూసి వేయనున్నారు. ఈ నేపథ్యంలో ఇరు రాష్ట్రాల అధికారుల సమక్షంలో గేట్లను తెరిచారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ ఈఈ వెంకటేశ్వర్‌లు, పోచంపాడ్ ఎస్ఈ శ్రీనివాస్‌గుప్త, ఈఈ చక్రపాణి, నాందేడ్ ఈఈ బన్‌సూద్, ఏఈఈ వంశీ, సీడబ్ల్యూసీ ఎస్‌డీఈ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

త్రివేణి సంగమం వద్ద జలకళ

నిజామాబాద్ రెంజల్ మండలం కందకుర్తి గోదావరి త్రివేణి సంగమంలో కొత్త నీరు రావడంతో జలకళ సంతరించుకుంది. ఇసుక దిబ్బలతో ఎడారిగా కనబడిన గోదావరి.. సోమవారం బాబ్లీ గేట్లను తెరవడంతో మిగులు జలాలు గోదావరిలోకి రావడంతో జలకళ సంతరించుకుంది.

ఎస్సారెస్పీలో 10.47 టీఎంసీల నీరు

ఎస్సారెస్పీ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు(80.5 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1059.9 అడుగుల(10.474 టీఎంసీల) నీరు నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి 1064.90 అడుగుల(15.881 టీఎంసీల) నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు. ఈ సారి వర్షాకాలం ప్రారంభమైనా వర్షాలు లేకపోవడంతో ప్రాజెక్టులోకి నీరు రాకపోవడంతో బోసిపోయింది. గతేడాది కంటే సుమారు 5 టీఎంసీల మేర నీటిమట్టం తగ్గడం గమనార్హం.

వెల్లువలా వినతులు

- ప్రజావాణికి నిజామాబాద్‌లో 130, కామారెడ్డిలో 102 వినతులు, ఫిర్యాదులు
- ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయొద్దు
- ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి
- అధికారులకు కలెక్టర్ల ఆదేశం

నవతెలంగాణ-కామారెడ్డి/నిజామాబాద్‌సిటీ

ప్రజావాణిపై ఎంతో నమ్మకంతో వచ్చే ప్రజల ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. వివిధ మండలాల నుంచి వచ్చిన ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సోమవారం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశమందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల ద్వారా స్వీకరించారు. ప్రధానంగా విద్యవైద్య, బిసి, గిరిజన సంక్షేమం, విద్యుత్, పంచాయతీ, పింఛన్లు, ఆవద్బుందు, మున్సిపాలిటీ, ధరణి, మైన్స్, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు తదితర అంశాలకు సంబంధించి ఫిర్యాదులు అందాయి. అట్టి ఫిర్యాదులను ఆయా శాఖాధికారులకు అందజేస్తూ పరిష్కరించవలసినదిగా ఆదేశించారు.


కామారెడ్డిలో ప్రజావాణి అనంతరం అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఈ సందర్భంగా కామారెడ్డి కలెక్టర్ ఆశీస్ సంగ్వాన్ మాట్లాడుతూ ... ప్రజావాణితో పాటు ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వచ్చిన ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత నిస్తూ క్షుణ్ణంగా పరిశించి పరిష్కరింపదగినవి వెంటనే పరిశీలించాలని, లేని వాటికి తగు ప్రత్యామ్నాయ మార్గం ఫిర్యాదుదారునికి తెలపాలని అన్నారు. ఈ ప్రజావాణికి రెవెన్యూ శాఖకు 55, డిఆర్డిఓకు 13, డబల్ బెడ్ రూమ్‌ల కోసం 9, జిల్లా పంచాయతీ అధికారికి 5, భూకొలత రికార్డు కార్యాలయానికి 5, మున్సిపల్కు 3, గిరిజన శాఖకు 2, పోలీస్ శాఖకు 3, ఉపాధి కల్పన శాఖ, విద్యాశాఖ, రోడ్లు భవనాల శాఖ, విద్యుత్ శాఖ, ఇరిగేషన్ తదితర శాఖలకు ఒక్కొక్క ఫిర్యాదు చొప్పున అందాయి,. మొత్తంగా 102 ఫిర్యాదులు ప్రజావాణికి వచ్చాయి. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డిఆర్డిఓ చందర్, డిపిఓ శ్రీనివాసరావు, సిపిఓ రాజారాం, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


నిజామాబాద్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్, అధికారులు

నిజామాబాద్‌లో 130

నిజామాబాద్ సిటీ : ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 130 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో పాటు అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, డీఆర్డీఓ సాయాగౌడ్, డీపీఓ తరుణ్ చక్రవర్తిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమస్యలను వెంటదివెంట పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ సమస్య పరిష్కారం పట్ల
చొరవ చూపేనా..?

- నేడు మండల సర్వసభ్య సమావేశం


భిక్కనూర్‌లోని పీహెచ్‌సీ

నవతెలంగాణ-భిక్కనూర్

ఒక మండలంలోని ప్రజలు ఒకే పీహెచ్సీ పరిధిలోకి వస్తారు. కానీ భిక్కనూరు మండలంలో మాత్రం మండల ప్రజలు రెండు మండలాలు భిక్కనూర్, రాజంపేట్ పీహెచ్సీ పరిధిలోకి రావడం కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భిక్కనూరు మండలంలో 18 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో 14 గ్రామ పంచాయతీలు మాత్రమే భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోకి రాగా మిగిలిన తిప్పాపూర్, మోటాటి పల్లి, అంతంపల్లి, జంగంపల్లి 4 గ్రామపంచాయతీలు రాజంపేట్ పీహెచ్సీ పరిధిలోకి వచ్చాయి. 4 గ్రామాల ప్రజలు చికిత్స కొరకు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న భిక్కనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోకి వెళ్లకుండా 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కామారెడ్డి మీదుగా రాజంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్సలు, ఎన్‌సిడి, టీబీ, బాలింతల చికిత్స, అమ్మ ఒడి, ప్రసవాలు, న్యూట్రిషన్ కిట్ చికిత్సలు, రికార్డు నమోదు చేసుకుంటున్నారు. సమస్య పరిష్కరించాలని గత రెండు సర్వసభ్య సమావేశాలలో ప్రజా ప్రతినిధులు సభ దృష్టికి తీసుకువచ్చినా ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని ఎంపీపీ గాల్ రెడ్డి తెలియజేసినా నేటికీ పీహెచ్సీ సమస్య పరిష్కారం కాలేదు.

నేడు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ హాజరవుతున్నందున పీహెచ్సీ సమస్య ఇప్పటికైనా పరిష్కరించాలని 4 గ్రామాల ప్రజలు కోరుచున్నారు.

డీఎస్ కుటుంబీకులకు పరామర్శ


ఎంపీ అరవింద్‌తో మాట్లాడుతున్న మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

డీ.శ్రీనివాస్ కుటుంబీకులకు సోమవారం పలువురు పరామర్శించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి బోత్స సత్యనారాయణ, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు ప్రసాద్ ఎంపీ అరవింద్‌ను పరామర్శించారు. అంత్యక్రియలు జరిగిన ప్రదేశంలో డీఎస్‌కు నివాళి అర్పించారు. అదే విధంగా వర్ధన్నపేట్ మాజీ ఎమ్మెల్యే ఆరూరీ రమేశ్, ఎర్రబెల్లి ప్రదీప్, ఎడ్ల అశోక్ రెడ్డిను అరవింద్‌ను కలిసి మాట్లాడారు. డీఎస్ మృతిపట్ల సంతాపం ప్రకటించారు.

ఆశాలతో వెట్టిచాకిరీ తగదు

- పారితోషికం లేని బీసీజీ సర్వే నిలిపివేయాలి
- ఆశాలకు కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలి
- సీఐటీయూ డిమాండ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ


కలెక్టరేట్‌కు వచ్చిన ఆశాలు, సీఐటీయూ నాయకులు

ఆశాలతో వెట్టిచాకిరీ చేయించొద్దని పారితోషికం లేని బీసీజీ సర్వే నిలిపివేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.18 వేలు అమలు చేసి సకాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆశ వర్కర్ల సమస్యలపైన అడిషనల్ కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ప్రయోగాత్మకంగా బీసీజీ సర్వే పేరుతో కొత్త సంస్కరణ తీసుకువచ్చారని, ఉన్న పనులు చేయడానికి ఆశాలకు సమయం, శక్తి సరిపోవటం లేదని తెలిపారు. ఇలాంటి సమయంలో కొత్త కొత్త సంస్కరణలు రాష్ట్ర హెల్త్ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఎగ్జామ్ విధానాన్ని, బీసీజీ సర్వే విధానాన్ని అమలు చేయాలని మెటీరియల్ ఇవ్వకుండానే జిరాక్సులు మీరే చేయించు కోవాలని ప్రయాణ చార్జీలు కూడా మీరే పెట్టుకోవాలని నెల నెల జీతాలు సరిగ్గా లేక అనేక ఇబ్బందులు పడుతున్న ఆశలకు పైసా పారితోషికం ఇవ్వకుండా బీసీజీ (బేసిల్లస్ కాల్‌మేట్ గెరిన్) సర్వే చేయించాలని చూడటం తగదని అన్నారు. పారితోషకం లేని పనులు ఆశాలతో చేయించ రాదని అదనపు పనికి అదనపు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆశా కార్యకర్తలు గత 19 సంవత్సరాలుగా గ్రామాల్లో బస్తీల్లో బీపీ, షుగర్, థైరాయిడ్ మాతా శిశు సంరక్షణ, కరోనా వంటి విపత్కర అనారోగ్య సమస్యలు ఏర్పడినప్పుడు ప్రజలకు ముందుండి పనిచేస్తున్నారని, వీరి సేవలను నేషనల్ హెల్త్ ఆర్గనైజేషన్ హెల్త్ గ్లోబల్ లీడర్‌గా గుర్తించినట్టు తెలిపారు. అలాంటి స్కిల్ ఆశా కార్యకర్తలకు మళ్లీ నూతన ప్రవేశ పరీక్ష విధానాన్ని తీసుకురావడం చాలా శోచనీయమని మండిపడ్డారు. ఈ ప్రవేశ పరీక్ష పెట్టడం వల్ల ఆశా కార్యకర్తల్లో భయాందోళనలుకు గురవుతున్నారని తెలిపారు. ఈ సమస్యలను పరిష్కారం చేయకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆశ యూనియన్ జిల్లా కోశాధికారి రేణుక జిల్లా ఉపాధ్యక్షులు సుకన్య సిహెచ్ నర్స, అరుణ, సుమలత వనిత ఆసియా రేవతి హనీఫా సుప్రియ సుజాత లలిత పుష్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రమోషన్‌లలో ఎస్‌జీటీలకు అన్యాయం

- నల్లబ్యాడ్జీలతో టీఆర్‌టీఎఫ్ నిరసన



నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

రాష్ట్రంలో జరుగుతున్న ప్రమోషన్లలో గాని బదిలీలలో గాని అన్య ఎస్జీటీలకు అన్యాయం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) నిజామాబాద్ జిల్లా శాఖ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం పలు స్కూళ్ల ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసనవ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం జరుగు తున్న పదోన్న తులు బదిలీల షెడ్యూల్లో భాగంగా సెకండరీ గ్రేడ్ టీచర్స్ కు ఉన్నత, ప్రాథమి కోన్నత, ప్రాథమిక పాఠశాలలో అన్ని ఖాళీలను చూయిం చకపోవడం పట్ల తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపు మేరకు నిజామాబాద్ జిల్లాలో వివిధ పాఠశాలల్లో ఉపాధ్యా యులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బట్టు కృష్ణారెడ్డి, రుద్రంగి ప్రవీణ్ కుమార్ మాట్లా డుతూ ముఖ్యమంత్రి ఆకాంక్షకు విరుద్ధంగా ఈ బదిలీల షెడ్యూల్లో అన్ని పాఠశాలల ఎస్‌జీటీ వేకెన్సీలను చూపించ కుండా ఇంటర్నల్ రేషనలైజేషన్ చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు.

అంతేకాకుండా లెఫ్ట్ ఓవర్ వేకెన్సీ లను వెంటనే పదోన్నతులతో భర్తీ చేసి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పదోన్నతులను కూడా ఈ షెడ్యూల్ లోనే చేపట్టాలని రాష్ట్రంలో సుమారు 1000 కి పైగా భాషా పండిత పి ఈ టి పోస్టులు ఉన్నతీకరణ చేసి పండిత పి ఈ టి లకు న్యాయం చేయాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ఉన్నత పాఠశాలలో మరియు విద్యా శాఖలో పనిచేస్తున్న పార్ట్ టైం ఉద్యోగులకు రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా చాలా పాఠశాలలో పనులు సగం చేపట్టి వదిలేశారని, అట్టి పాఠశాలల్లో వెంటనే పనులు చేపట్టి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు.

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- యువకుడు అక్కడికక్కడే మృతి


మృతిచెందిన సాయికిరణ్

నవతెలంగాణ-వర్ని

బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతిచెందిన ఘటన మోస్రా మండలం గోవూర్‌లో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రుద్రూర్ మండలం చిక్కడపల్లి గ్రామానికి చెందిన జిల్ల సాయికిరణ్ (21) తమ బంధువులను బస్సు ఎక్కించేందుకు వచ్చి తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మోస్రా వైపు బైక్‌పై వెళుతున్న యువకుడిని నిజామాబాద్ నుంచి బాన్సువాడ వైపు వస్తున్న బస్సు అతి వేగంగా వచ్చి ఢీకొనడంతో యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త

- నిజామాబాద్ నగర మేయర్ సూచన

నవతెలంగాణ-కంఠేశ్వర్


మాట్లాడుతున్న మేయర్

సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూ కిరణ్ ప్రజలకు సూచించారు. ఈ మేరకు నగరంలోని మున్సిపాల్ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్‌లో సోమవారం మీడియా ద్వారా ప్రజలకు మేయర్ పలు సూచనలు తెలియజేశారు. వర్షకాలం దృష్ట్యా ఇంటి పరిసరలలో నీరు నిలువ ఉండకుండా చూడాలని దోమల ద్వారా డెంగి, మలేరియా నిలిచిన నీటిలో పెరిగే అవకాశం ఉన్నందున నిటి కుళాయిలను ఎప్పటికప్పుడు శుభం చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ ద్వారా తీసుకోవాల్సిన అన్నీ చర్యలు చేపడుతున్నామని నీరు ఎక్కువగా నిలిచే ప్రాంతాలలో ఆయిల్ బాల్స్ వేయటం, మురికి నాళాల పూడికతీయటం పూర్తి చేసామని అన్నారు. ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షిస్తున్నమని ఇల్లా మధ్య ఉన్నా కాళీ స్థలలలో నీరు నిలిచినట్లైతే నీతిని తొలగించే యంత్రాంగం ప్రతి జోన్ పరిదిలో అందుబాటులో ఉంటారని తెలియజేశారు.

భార్య కాపురానికి రావడం లేదని
భర్త ఆత్మహత్య

నవతెలంగాణ-వర్ని(మోస్రా)


మృతి చెందిన పోశెట్టి

భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మోస్రా మండలంలోని గోవూర్ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఈచిత పోశెట్టి(25) కూలీ పనులు చేసుకునే వ్యక్తి. కుటుంబ కలహాలతో ఆయన భార్య కొద్ది రోజుల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. వీరికి ఒక కూతురు ఉంది. కాపురానికి రావాలని పలుమార్లు కోరినా రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యేవాడు. ఈ క్రమంలో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలోఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

ఆరోగ్య ఉప కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-డిచ్‌పల్లి


ఆరోగ్య ఉప కేంద్రాన్ని జడ్పీటీసీ

ఇందల్‌వాయి మండలంలోని చంద్రయాన్‌పల్లి గ్రామంలో రూ.7లక్షలతో నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రాన్ని జిల్లా పరిషత్ సభ్యురాలు సుమన రవిరెడ్డి, ఎంపీపీ బాదావత్ రమేష్ నాయక్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి సుమన రవిరెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలో 20 ఏళ్లుగా ఆరోగ్య ఉపకేంద్రం లేక గ్రామస్తులు ఇబ్బందులకు గురవుతున్నారని విషయం తెలిపిన వెంటనే జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ.5లక్షలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. పనులు పూర్తి కాకపోవడంతో మండల పరిషత్ నుంచి రెండు లక్షల రూపాయలను మంజూరు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు అరటి రఘు, సంజీవ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పాశంకుమార్, మాజీ ఉపసర్పంచ్ ప్రకాష్, శ్రీధర్‌గౌడ్, కార్యదర్శి రజని, ఏఎన్ఎం.సావిత్రి, ఉదయ, అంగన్వాడీ టీచర్ మంజుల, కారోబార్ రాజాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని కృష్ణ నగర్ శివారులో గల పంటపొలాల్లోకి ఆదివారం రాత్రి కారు దూసుకెళ్లింది. స్థానికుల కథనం ప్రకారం.. నిజామాబాద్ మండలంలోని ఆకుల కొండూరు నుంచి మాక్లూర్ వస్తున్న కారు అతి వేగంగా వచ్చిందని, ఎదురుగా ఉన్న పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. అందులో గల నలుగురికి ఎలాంటి ప్రమాదం జరుగలేదు. మూల మలుపు వద్ద ఎలాంటి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. వెంటనే ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

వైద్యులకు ఘన సన్మానం

నవతెలంగాణ-బాల్కొండ

జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ బాల్కొండ ఫోర్ట్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో వైద్యులకు శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ బాల్కొండ ఫోర్ట్ ప్రెసిడెంట్ అందే వెంకటగిరి, సెక్రటరీ ద్యావతి పోశెట్టి, ట్రెజరర్ గొడ్మే శ్రీనివాస్, సభ్యులు చౌటి కిషన్, అల్వాల వెంకటేష్, బరిగిడి మల్లేష్, బరిగిడి మహేందర్, ఆరేపల్లి సాయిలు, తౌట్ గంగాధర్, నల్ల కృష్ణ కాంత్‌రెడ్డి, సల్ల గరిగే రాజేందర్, వైద్యురాలు రక్షిత, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వైద్యులను సన్మానిస్తున్న క్లబ్ ప్రతినిధులు

ఓపెన్ జిమ్‌ను వినియోగించుకోవాలి

- ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్



ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

యువకులు, చిన్నారులు, పెద్దల కోరిక మేరకు లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్ సూచించారు. ఇందల్‌వాయి మండలంలోని చంద్రయాన్‌పల్లి గ్రామంలో జిల్లా కలెక్టర్ రూ.5లక్షల నీదులు, మండల పరిషత్ నుంచి రూ.2 లక్షలు, మొత్తం రూ.7లక్షలతో నిర్మించిన ఓపెన్ జీమ్‌ను జెడ్పిటిసి సుమన రవిరెడ్డితో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మాజీ ఎమ్మెల్సీ వి.గంగాధర్‌గౌడ్‌ల సహాయ సహకారాలతో కోట్లాది రూపాయలతో గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అరటి రఘు, సంజీవ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పాశంకుమార్, మాజీ ఉపసర్పంచ్ ప్రకాష్, శ్రీధర్‌గౌడ్, కార్యదర్శి రజని, ఏఎన్ఎం సావిత్రి, ఉదయ, అంగన్వాడీ టీచర్ మంజుల, కారోబార్ రాజాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధు అమలుపై అభిప్రాయ సేకరణ

- సింగిల్ విండోల్లో ప్రత్యేక మహాజనసభ



అర్గుల్‌లో సమావేశంలో పాల్గొన్న సంఘ సభ్యులు, రైతులు

నవతెలంగాణ-జక్రాన్ పల్లి

మండలంలోని ఆర్గుల్, బ్రాహ్మణపల్లి సింగిల్ విండోలలో ప్రత్యేక మహాజనసభ లు సోమవారం నిర్వహించారు. రైతు బంధు అమలుపై రైతుల అభిప్రాయ సేకరణ కు ప్రత్యేక మహాజన సభలు నిర్వహించారు ఈ సమావేశంలో జిల్లా సహకార అధికారి శ్రీనివాసరావ్, క్లస్టర్ ఆఫీసర్ పోషన్న, ఆడిట్ అధికారి రమేష్ రావ్, మానిటర్ అధికారి ఆనంద్, మండల వ్యవసాయ అధికారి దేవిక, సొసైటీ అధ్యక్షులు ఆర్మూర్ గంగారెడ్డి, ఉపాధ్యక్షులు అప్పాల నడిపి రాజన్న రైతులు, పాలకవర్గ సభ్యులు, సంఘ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న ఈరవత్రి అనిల్, మానాల

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని పలు బాధిత కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, మాజీ చీఫ్ విప్ ఈరవత్రి అనిల్ కలిసి ఆదివారం రాత్రి పరామర్శించారు. ఇందులో భాగంగా మండలకేంద్రానికి చెందిన ఎర్రవేణి ముత్తెమ్మ, క్యాన్సర్‌తో బాధపడుతున్న విషయం తెలుసుకొని ఆ కుటుంబాన్ని కలిసి ఆమె చికిత్స కోసం ప్రభుత్వం నుండి సాయం అందేలా కృషిచేస్తామని హామీనిచ్చారు. ఏర్గట్లకు చెందిన దొబ్బల చిన్న లక్ష్మణ్ తండ్రి అనారోగ్యంతో భాధపడుతున్నాడని తెలుసుకుని వారి కుటుంబాన్ని పరామర్శించారు. మండలకేంద్రానికి చెందిన మెరుగు ముత్తెన్న ఇటీవలె అనారోగ్యంతో మృతిచెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. గుమ్మిర్యాల్ గ్రామానికి చెందిన సోమ ముత్తెన్న ఇటీవలే మరణించగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దయానంద్ అనారోగ్యంతో భాధపడుతుండగా ఆయనను కలిసి పరామర్శించారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు సోమ దేవరెడ్డి,జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్,నాయకులు గడ్డం జీవన్, రేండ్ల రమేష్,రొక్కిడ సంజీవ్, పెద్దిరెడ్డి రవి, తుపాకుల శ్రీనివాస్ గౌడ్, సంజీవ్ యాదవ్, మునీరోద్దీన్, సున్నపు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైద్యుల దినోత్సవం

నవతెలంగాణ-ముప్కాల్

డాక్టర్స్ డే సందర్భంగా ముప్కాల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని పలువురు వైద్యులను సన్మానించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు కొమ్ముల నర్సయ్య మాట్లాడుతూ.. వైద్య వృత్తి పవిత్రమైందని అన్నారు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు మంచి వైద్యం అందించడం డాక్టర్‌కు మొదటగా ఉండాల్సిన లక్షణమన్నారు. తద్వారా అట్టి డాక్టర్ కు సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని అన్నారు. వైద్యులకు డాక్టర్స్ డే 'జాతీయ వైద్యుల దినోత్సవ' శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు కొమ్ముల నర్సయ్య సెక్రటరీ జక్కుల శ్రీనివాస్, ట్రెజరర్ గడ్డం సురేష్ రెడ్డి, సభ్యులు చాకు లింగం, సిద్ధ రమేష్, లింగం తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారం, రాగి జావ, కోడి గుడ్డు పెట్టలేం

- ఏఐటీయూసీ
- డీఈవో దుర్గాప్రసాద్‌కు వినతి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

అల్పాహారం, రాగి జావ, కోడి గుడ్డు పెట్టలేమని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. ఓమయ్య అన్నారు. ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డీఈవో దుర్గాప్రసాద్‌కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. ఓమయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద బలహీన వర్గాల పిల్లల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. స్కూలు ప్రారంభమై నెల గడుస్తున్న నేటికీ మధ్యాహ్న భోజన కార్మికులకు ఐదు నెలల బకాయి బిల్లులు, వేతనాలు చెల్లించకుండా నిర్లక్ష్యం చేయడమే కాకుండా మూలిగే నక్కపై తాటికాయబడ్డ చందంగా అదనంగా రాగి జావ, కోడిగుడ్డు, అల్పాహారం అందించాలని అన్నారు. కార్మికులపై ఒత్తిడి తీసుకురావటం సరైన పద్ధతి కాదన్నారు. కొన్ని ప్రాంతాల్లో శ్రీ సాయి ట్రస్ట్ ద్వారా పిల్లలకు రాగిజావ పెడ్తా వండినందుకుగాను ఆ ట్రస్ట్ వారికి ఒక రూపాయి 25 పైసలు చెల్లిస్తున్నారని, ఆపరేషన్ ఈ అటువంటి విధానాన్ని కార్మికుల పట్ల అవలంభించాలని అన్నారు. గత ప్రభుత్వ హయాం నుండి యూనియన్ ద్వారా పోరాటం చేస్తుంటే నేటికీ ప్రభుత్వం స్పందించకపోగా కార్మికులకు అదనంగా ఆర్థిక భారం మోపే ప్రయత్నం చేయడం సిగ్గుచేటని అన్నారు. కోడిగుడ్డు ధర బహిరంగ మార్కెట్లో 6 రూపాయలు ఉంటే ఐదు రూపాయలకే కోడిగుడ్డు పెట్టమనటం ఎంతవరకు సమంజసం అన్నారు. అల్పాహారం, రాగిజావకు సంబంధించి అదనంగా 12 రూపాయలు చెల్లించాలని తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికుల రాష్ట్ర ప్రభుత్వ ఎన్నికల హామీలో భాగంగా 10వేల రూపాయల వేతనాన్ని చెల్లించాలని, ఇన్సూరెన్స్ యూనిఫారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి .చక్రపాణి, అధ్యక్షురాలు సాయమ్మ నాయకులు పల్లికొండ నరేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు



వినతిపత్రం అందజేస్తున ఏఐఎస్ఎఫ్ నాయకులు

నిజామాబాద్‌సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షురాలు అంజలి అన్నారు. సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ అంకిత్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా అధ్యక్షురాలు అంజలి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న 7 వేల పైచిలుకు కోట్ల రూపాయల స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడం ద్వారా విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్యార్థులు చదివిన కళాశాలలో తమ కోర్సు పూర్తి చేసిన వారి సర్టిఫికెట్లు కళాశాల యాజమాన్యాలు ఇవ్వడం లేదని అన్నారు. దీనిద్వారా ఉన్నత చదువులకు, ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న వారికి ఇబ్బందికరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ లో ఉన్న స్కాలర్, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వానిక డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు శివాజీ, నవీన్, వంశి పాల్గొన్నారు

భూమిని కబ్జా కాకుండా కాపాడండి

- ప్రజావాణిలో ఫిర్యాదు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండలంలోని గౌరరం గ్రామ పంచాయతీ పరిధిలోని లింగాపూర్ గ్రామనికి చెందిన నిరుపేదల ఆర్థిక పరిస్థితి, మాకు ఉండటానికి ఇల్లు కూడా లేదు. గ్రామంలో ఇండ్లు లేని నిరుపేదలందరం కలిసి రెండు పగకల ఇండ్లు కేటాయించాలని 2020లో తెలంగాణ ప్రభుత్వాను విన్నవించామని, దానికి అనుగుణంగా రెవెన్యూ అధికారులు జులై 2 2020న అ భూమి నుంచి సందర్శించి మోకా పంచనామా నిర్వహించారని సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేదలందరికి కలిపి 0-20 గుంటల భూమి తులసమ్మ అసైన్మెంట్ భూమిలో గ్రామంలోని పేదలకు ఇండ్ల కోసం అందజేశామని, అ భూమిని ఆక్రమించుకోవాలని గత కొన్ని రోజుల నుంచి మైలారం చిన్నరెడ్డి, సంతోష్‌రెడ్డి లింగాపూర్ గ్రామం వాసి ప్రభుత్వ భూమిలోకి తరచు వచ్చి ఆ ప్రభుత్వ భూమిని కబ్జా చేయాలని చూస్తున్నాడని, ట్రాక్టర్, జెసిబిలను తీసుకొని వచ్చి భూమి చదును చేస్తున్నారని అభూమిని అన్యాక్రాంతం కాకుండా కాపాడి పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని వెడుకున్నారు. మైలారం చిన్నరెడ్డి, సంతోష్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి పేదలకు రెండు పడకల గదుల కోసం కేటాయించిన 0-20 గుంటల భూమిని అక్రమంగా, దౌర్జన్యంగా ప్రవేశించి జెసిబి, ట్రాక్టర్లతో చదును చేసి కబ్జా చేయాలని ప్రయత్ని స్తుండగా అడ్డుకొన్నందుకు గాను మాపై దౌర్జన్యం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామంలోని లబ్దిదారులను భయబ్రాంతులకు గురి చేస్తూ భూమి కబ్జా చేయాలని ప్రయత్నిస్తున్నాడని, అతనిపై చట్టరీత్య చర్యలు తీసుకొని, పేదలకు రెండు పడకల గదుల ఇండ్ల కోసం కేటాయించిన 0-20 గుంటల భూమిని కాపాడాలని విన్నవించారు.



వినతిపత్రం అందజేస్తున్న

బాలకార్మికుల సమాచారం తెలిస్తే తెలపండి

- అదనపు పోలీస్ కమిషనర్
- ఆపరేషన్ ముస్కాన్‌పై సమీక్ష సమావేశం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఆపరేషన్ ముస్కాన్' సమీక్ష సమావేశం" పోలీస్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్‌లో సోమవారం నిజామాబాద్ అదనపు డిసిపి (అడ్మిన్) బి. కోటేశ్వరరావు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు డిసిపి (అడ్మిన్) మాట్లాడుతూ.. నిజామాబాద్ పోలీస్ కమీషనరేటు పరిధిలో "ఆపరేషన్ ముస్కాన్" కార్యక్రమం ఈ నెల 1 నుంచి 31 వరకు నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలో 18 సంవత్సరాలలోపు తప్పిపోయిన, వదిలివేసిన, కార్మికులుగా ఉన్న బాలబాలికలు ఉన్నట్లయితే అలాంటి వారి సమాచారం సేకరించి, రక్షించి వారి తల్లిదండ్రులకు అప్పగించాలని తెలిపారు. పిల్లలతో బలవంతంగా బిక్షాటన చేయించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేకంగా డివిజన్ పరిధిలో ఒక ఎస్సై, నలుగురు సిబ్బందిని నియమించడం జరుగుతుందని తెలిపారు. బాలకార్మికుల సమాచారం తెలిస్తే ఈ ఫోన్ నెంబర్లకు డయల్ 100, స్పెషల్ బ్రాంచ్ కంట్రోల్ రూమ్ సెల్‌నెంబర్ 87126-59777, నిజామాబాద్ ఇంచార్జి ఎస్సై 87126-59795, ఆర్మూర్ ఇంచార్జి ఎస్సై 94930-21372, బోధన్ ఇంచార్జి ఎస్సై 97050-83941 లకు సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతారని తెలిపారు. సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, సిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రాజ్, యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్‌స్పెక్టర్ సురేష్, జిల్లా లేబర్‌ఆఫీసర్ యోహన్, జిల్లా సంక్షేమ అధికారి రసూల్ బి, చైల్డ్ వెల్ఫేర్ కమిటి చైర్ పర్సన్ సంపూర్ణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తుకారం రాథోడ్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి చైతన్య, నిజామాబాద్ ఇంచార్జీ మహిళా ఆర్ఎస్ఐ స్రవంతి, ఆర్మూర్ ఇంచార్జీ ఎస్ఐ హన్మాండ్లు, బోధన్ ఇంచార్జీ ఎఎస్ఐ బాబూరావ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు పోలీస్ కమిషనర్

ఎస్బిఐ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



మాట్లాడుతున్న డీజీఎం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

69వ స్టేట్ బ్యాంక్‌డే సందర్భంగా ఎస్బిఐ గంగాస్థాన్ బ్రాంచ్ వారి ఆధ్వర్యంలో స్నేహ సొసైటీ, నిజామాబాద్‌లో 175 మంది విద్యార్థులకు పండ్లు, బిస్కెట్లు పంపిణి చేశారు. వినాయకుల బావి బ్రాంచ్ నందు వైద్య శిబిరంలో మెడికవర్ హాస్పిటల్, శ్రీ నేత్రాలయ హాస్పిటల్‌తో కలిసి రక్త పరీక్ష, కంటి పరీక్ష, ఈసిజీ నిర్వహించారు. కార్యక్రమంలో డిజీఎం బిజయ కుమార్ సాహూ, రీజనల్ మేనేజర్ మహేశ్వర్ కోలేటి, చీఫ్ మేనేజర్ రవి కుమార్, బ్రాంచ్ మేనేజర్ నాగేంద్రమ్మ, మేనేజర్ ఎస్. ప్రేమ్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్‌కు బార్ అసోషియేషన్ సంతాపం



నివాళ్లు అర్పిస్తున్న న్యాయవాదులు

నవతెలంగాణ-ఆర్మూర్

డిఎస్ మతి తీరని లోటు అని పట్టణ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తెడ్డు నర్సయ్య సోమవారం అన్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అయన మతికి సంతాపాన్ని ప్రకటించారు. సంతాప సూచనగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో ఉప అధ్యక్షులు పి.శంకర్,అడిషనల్ పిపి ఖాందేశ్ శ్రీనివాస్, బార్ సభ్యులు,సీనియర్ న్యాయవాదులు, జూనియర్ న్యాయ వాదులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు మంగళవారం 11గంటలకు తహశీల్దార్ కార్యాలయంలో కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేయడం జరుగుతుందని తహశీల్దార్ శ్రీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లబ్ధిదారులకు ముందస్తుగా సమాచారం ఇవ్వడం జరిగిందని తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధుల చేతులమీదుగా చెక్కులు అందజేస్తామన్నారు.

వ్యవసాయ కార్మిక సమగ్ర చట్టం తీసుకురావాలి

- అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

వ్యవసాయ కార్మికుల సమగ్ర చట్టం తీసుకురావాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ ఆంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ.. భారతదేశంలో 60 శాతం మంది వ్యవసాయ రంగంలో పని చేస్తున్నారన్నారు. సుమారు 14 కోట్ల మంది వ్యవసాయ కార్మికులు ఉన్నారని, సేద్యం ప్రారంభం నుండి విత్తనాలు విత్తడం, నాట్లు వేయడం, కలుపు తీయడం, అన్ని పంటల సేకరణ లాంటి పనులు ఎన్ని చేసినా రైతుకు, వ్యవసాయ కార్మికులకు తక్కువ ఆదాయంతో తగిన పని దొరకడం లేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వ్యవసాయ కార్మికులకు రోజువారి కూలీ రూ.600 లకు పెంచాలన్నారు. కార్యక్రమంలో సారా సురేష్, కిషన్, ఆనంద్, సత్యక్క, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

దోమలతో వచ్చే వ్యాధులపై అవగాహన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దోమల వల్ల వచ్చే వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. దోమల వల్ల వ్యాపించే వ్యాదులైన మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్య, ఫైలేరియా, జపనీస్, ఎన్ సేఫలైటీస్ తదితర వ్యాధులపై ఆరోగ్య విద్య బోధకులు కటుకం శంకర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చేసి దోమలను పుట్టకుండా చూడాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, జ్వరం వస్తే ఏ మాత్రం ఆలస్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకొని మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పసుపుల సాయన్న, ఉపాధ్యాయులు నాగభూషణం, లక్ష్మీనరసయ్య, ఏఎన్ఎం స్వరూప, ఆరోగ్య కార్యకర్తలు సంధ్యారాణి, స్వరూప, సాగరిక, శోభ, నర్మద, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రజావాణి

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని తానకుర్ది సబ్‌స్టేషన్ పరిధిలో ఎఈ బాబా శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రజావాణి సోమవారం నిర్వహించారు. అక్కడికి వచ్చిన వినతి పత్రాలను స్వీకరించి అతి తొందరలో వారికి సమస్య పరిష్కారమయ్యే విధంగా చూస్తానని తెలిపారు.

కోట మైసమ్మ దేవాలయ వార్షికోత్సవం

- పాల్గొన్న అర్బన్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కోటగల్లి కోట మైసమ్మ దేవాలయ వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా హాజరయ్యారు. మొదట బంగారు మైసమ్మ గుడిలో ప్రతేక పూజ కార్యక్రమాలు నిర్వహించి అనంతరం ఆలయ కమిటీతో కలిసి అమ్మవారి వెండి ఆభరణాలు ఊరేగింపుగా తీసుకెళ్లి కోట మైసమ్మ అమ్మవారికి సమర్పించారు. అనంతరం ప్రతేక పూజకార్యక్రమం, అలంకరణ, కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధన్‌పాల్ మాట్లాడుతూ.. నిజామాబాద్ నగర ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు, ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యేని ఆలయ కమిటీవారు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు అంతరెడ్డి దేవేందర్ రెడ్డి, ఆలయ కమిటీ కన్వీనర్ సిరిగాద ధర్మపురి, శక్తి కేంద్ర ఇంచార్జి పల్నాటి కార్తీక్, వెండి ఆభరణాల దాత చింతకాయల రాజేందర్, నాయకులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అమ్మ ఒడి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండల పరిధిలోని మత్తమాల గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం అమ్మ ఒడి కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆస్పత్రి వైద్యులు డాక్టర్ శరత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 30 మంది గర్భిణీలను పరిశీలించి వారికి అవసరమైన రక్త పరీక్షలు చేసి వివిధ దశలలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సలహాలు సూచించారు. అనంతరం డాక్టర్స్ డేను పురస్కరించుకొని ఆస్పత్రి సిబ్బంది డాక్టర్ శరత్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నర్సులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆయాలు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వివరాలు నమోదు చేసుకుంటున్న వైద్యులు

యూనిఫామ్, పుస్తకాల పేరిట దోపిడీని అరికట్టాలి

నవతెలంగాణ-బోధన్

ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పుస్తకాలు, ఫీజులు, యూనిఫాంల పేరుతో తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నారని వారిని అరికట్టాలని బీవీఎస్ విద్యార్థి సేన జిల్లా కోఆర్డినేటర్ లోకేష్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యార్థుల తల్లితండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చదివించాలనే ఉద్దేశ్యంతో నానా అవస్థలు పడి వేలాది రూపాయలు చెల్లిస్తున్నారని, విద్యార్థుల తల్లితండ్రుల బలహీనలతను ఆసరాగా తీసుకొని ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా వేలాది రూపాయలు దోపిడీ చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రైవేట్ పాఠశాలలకు పట్టించుకోవడం లేదన్నారు. పాఠ్య పుస్తకాలకు, యూనిఫామ్‌లకు అధికంగా డబ్బులు వసూలు చేస్తున్న ప్రయివేట్ పాఠశాలలపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పునర్జన్మ ప్రసాదించేది డాక్టర్లు

- ఘనంగా అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం
- పలువురు డాక్టర్లకు సన్మానం

నవతెలంగాణ-విలేకరుల బృందం

మృత్యువు అంచువరకు వెళ్లిన వారికి పునర్జన్మ ప్రసాదించేది డాక్టర్లేనని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా అంతర్జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులను ఘనంగా సన్మానించారు.

పిట్లం : మానవునికి పునర్జన్మను ప్రసాదించేది డాక్టర్ వృత్తి అని బాన్సువాడ డివిజన్ రెడ్‌క్రాస్ అధ్యక్షులు మార్గల వేణు కొనియడారు. అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వాసుపత్రి డాక్టర్లు శివకుమార్, సమద్, పూజను రెడ్‌క్రాస్, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య వృత్తి మహా అద్భుతమని, ప్రజలకు వివిధ రోగాల నుంచి విముక్తి కల్పించి నిరంతరం ప్రాణాలను పణంగా పెట్టి రక్షించేది ఒక డాక్టర్ వృత్తి అని కొనియాడారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ మండల ఉపాధ్యక్షులు బొడ్డ రాజు, సభ్యులు కిషన్, పుట్నాల లక్ష్మీనారాయణ, రమణగౌడ్, దన్నారపు సంతోష్, బెజ్జం చంద్రశేఖర్, పదియల విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి : మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో కోటగిరి లయన్స్ క్లబ్ డైమండ్ సభ్యులు డాక్టర్స్ డే సందర్భంగా కోటగిరి వైద్యాధికారి సుప్రియను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ సభ్యులు హనుమంతరావు, తెల్ల రవికుమార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట్ : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ లింగంపేట్ మండల శాఖ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే సందర్భంగా మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ హిమబిందు, అజయ్ హాస్పిటల్ డాక్టర్ అజయ్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించినట్టు ఐఆర్‌సిఎస్ మండలాధ్యక్షులు బొల్లు శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య వృత్తిని ప్రజలు దేవుడితో సమానంగా భావిస్తారని, నిరుపేదలకు కూడా మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని అసంక్రమిత వ్యాధుల నియంత్రణలో విశేష కృషి చేసి, కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి వైద్య సేవలను అందించిన డాక్టర్స్‌ను అభినందించామన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు వివేకానంద, బండి నర్సింలు, పరందాములు, గుండా బాలకిషన్ పాల్గొన్నారు.

బోధన్ : జాతీయ వైద్య దినోత్సవాన్ని పురస్కరించుకొని వాసవీక్లబ్, వనిత క్లబ్ ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలో వైద్యులను ఘనంగా సత్కరించారు. డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ అవినాష్ రెడ్డి, డాక్టర్ సుధీర్ గోజే, డాక్టర్ సుజేతే గోజే, డాక్టర్ నవరత్న డాక్టర్ సంతోష్‌రెడ్డితో పాటు పలువురు వైద్యులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్, వనిత క్లబ్‌ల ప్రతినిధులు మాట్లాడుతూ.. తల్లి జన్మనిస్తే వైద్యుడు సాధ్యమైనంత వరకు పునర్జన్మని కల్పిస్తాడని అన్నారు. వైద్యులు చేస్తున్న సేవలను తెలిపేందుకే జాతీయ వైద్య దినోత్సవంలో భాగంగా బోధన్‌లో వైద్యులకు సన్మానం చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షులు డాక్టర్ జాంకర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సూర్యరావు, వనిత క్లబ్ అధ్యక్షులు డాక్టర్ శాంతి శ్రీ, ప్రధాన కార్యదర్శి అంజలి జాంకర్, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అడిషనల్ ట్రెజరర్ కొత్త రవీందర్ గుప్తా, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ మహాజన్ రాణి, శ్రీ నగరేశ్వర, శ్రీ వాసవి కన్యక పరమేశ్వర ఆలయ ప్రధాన కార్యదర్శి, కోశాధికారి కంటాల రమేష్, పబ్బ మురళి తదితరులు పాల్గొన్నారు.



పిట్లం: వైద్యులను సన్మానించిన పలువురు



కోటగిరిలో...



బోధన్‌లో...

పాముకాటుతో వివాహిత మృతి

నవతెలంగాణ-లింగంపేట్



నునావత్ జనవ్వ (ఫైల్)

పాముకాటుతో వివాహిత మృతిచెందింది. ఈ ఘటన మండలంలోని కన్నాపూర్ తండాలో చోటుచేసుకుంది. తాండావాసులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన నునావత్ జనవ్వ (41) రోజువారి మాదిరిగానే ఆదివారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి నిద్రపోయింది. నిద్రిస్తున్న సమయంలో సుమారు రాత్రి 11 గంటల ప్రాంతంలో నల్ల త్రాచుపాము జనవ్వకు కాటు వేయడంతో నిద్రనుంచి తేరుకుని కుటుంబ సభ్యులకు జరిగిన ఘటనను తెలిపింది. దీంతో వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను కామారెడ్డి ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి తెల్లవారుజామున మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

మతిస్థిమితం లేని బాలిక ఆత్మహత్య

నవతెలంగాణ-భిక్కనూర్

మతిస్థిమితం లేని బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పెద్ద మల్లారెడ్డి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబీకులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన హరిబాబు కుటుంబీకులు పెద్ద మల్లారెడ్డి గ్రామంలో గత 18 సంవత్సరాల నుంచి గ్రామంలో వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవిసిస్తున్నారు. హరిబాబు చిన్న కూతురు సాయి (15) గ్రామంలో పదో తరగతి చదువుతున్నది. ఆదివారం సాయంత్రం వ్యవసాయ బావి వద్ద మతిస్థిమితం సరిగా లేని కారణంగా ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంటున్న సమయంలో స్థానికులు గమనించి కిందకు దించి.. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించింది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు.

వ్యక్తి అదృశ్యం

నవతెలంగాణ-భిక్కనూర్



శేఖర్‌గౌడ్ (ఫైల్)

వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్సై సాయి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. భిక్కనూరు పట్టణానికి చెందిన శేఖర్ గౌడ్ (47) అనే వ్యక్తి గత నెల 29న ఇంటి నుండి తన ప్రింటింగ్ ప్రెస్ షాప్‌కు వెళ్ళాడు. మధ్యాహ్నం భోజనానికి ఇంటికి రాకపోయేసరికి ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. షాప్ వద్ద తన ద్విచక్ర వాహనం ఉన్నా.. శేఖర్ గౌడ్ లేకపోవడం.. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబీకుల చుట్టుపక్కల, బంధువుల ఇండ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కొడుకును హత్య చేసిన తండ్రి అరెస్టు

- రిమాండ్‌కు తరలించిన పోలీసులు



నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఆస్తి తగాదాల విషయంలో కొడుకును హత్య చేసిన తండ్రిని పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్ తెలిపారు. ఈ మేరకు ఆయన వివరాలు వెల్లడించారు. ఎల్లారెడ్డి మండల పరిధిలోని గండి మాసానిపేట్ గ్రామానికి చెందిన కొడిపాక సాయిలు అనే వ్యక్తిని అతని తండ్రి కొడిపాక వెంకటేశం ఆస్తి తగాదాల ఘర్షణలో హత్య చేశాడు. దీంతో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన కర్రను, తువ్వాల(టవల్)ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు వెంకటేశంను రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో ఎస్సై మహేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మాతా శిశుఆరోగ్య సంరక్షణపై సమావేశం



రికార్డులను పరిశీలిస్తున్న అధికారిని

నవతెలంగాణ-భిక్కనూర్

పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం మాతా శిశు ఆరోగ్య సంరక్షణపై డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఓ, ఎంసిహెచ్ ప్రోగ్రాం ఆఫీసర్ శోభారాణి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలు, బాలింతలకు ఏ విధంగా సలహాలు సూచనలు చేస్తున్నారని, హైరిస్క్ డెలివరీ గుర్తించి ఏరియా ఆసుపత్రికి ఏ విధంగా పంపిస్తున్నారని మెడికల్ ఆఫీసర్ యేమిమాని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి గర్భిణీ స్త్రీలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే డెలివరీ అయ్యేవిధంగా సూచనలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణ అధికారి వెంకటరమణ, ఫార్మసిస్ట్ వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సజావుగా మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-కోటగిరి

మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ సునీత శ్రీనివాసరావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉమ్మడి మండలంలోని పలు సమస్యలను అధికారుల దృష్టికి ఎంపీటీసీ సభ్యులు తీసుకువచ్చారు. విద్యుత్, ఆర్అండ్‌బీ, విద్య తదితర అంశాలపై చర్చ కొనసాగింది. అనంతరం అధ్యక్షురాలు సునీత శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సహకరించిన అధికారులకు, ఎంపీటీసీ సభ్యులకు, అనధికారులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎంపీటీసీ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మనోహర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలి

- ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్



నవతెలంగాణ-భిక్కనూర్

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని మండలంలోని ప్రతి గ్రామంలో వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సోమవారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో జారీ చేసిన సూచనల మేరకు గ్రామపంచాయతీలలో వర్షాకాలం దృష్ట్యా ఎలాంటి వ్యాధులు డెంగ్యూ, డయేరియా, మలేరియా వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు తాగునీటి విషయంలో లీకేజీ లేకుండా చూడాలని, తప్పనిసరిగా క్లోరినేషన్ చేయాలన్నారు. మురుగు కాలువలు క్రమం తప్పకుండా పారిశుద్ధ్యం పరిశుభ్రంగా ఉంచాలని, స్టాగ్నేషన్ వాటర్ లేకుండా ఎక్కడైనా ఉంటే ఆయిల్ బాల్స్, దోమల నివారణకు ఫాగింగ్ చేయాలన్నారు. ఎక్కడ కూడా టైర్లు, పూల తొట్టిలలో నీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఫాగింగ్ ప్రతి మంగళవారం, శుక్రవారం చేయాలని, ప్రతి గ్రామంలో గ్రామ ప్రజలకు అవగాహన కల్పించేందుకు డోర్ టు డోర్ ప్రచారం చేయాలని తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే సర్వేసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ హాజరవుతున్నారని, సమావేశానికి ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని ఎంపీపీ గాల్ రెడ్డి తెలిపారు.

అసంపూర్తిగా డ్రయినేజీ నిర్మాణం

- నిలిచిన మురుగు నీరు..



నిలిచిపోయిన మురుగు నీరు

నవతెలంగాణ-భిక్కనూర్

పట్టణంలో గత గ్రామపంచాయతీ పాలకవర్గం పాత ఎన్.హెచ్.7 రోడ్డుకు ఇరువైపులా ఇటీవల కాలంలో నిర్మించిన డ్రైనేజీ నిర్మాణం అసంపూర్తిగా నిర్మించిన కారణంగా డ్రైనేజీ నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయి దుర్వాసన, దోమల బెడద ఎక్కువగా ఏర్పడుతుందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. కేవలం డ్రైనేజీ మాత్రమే నిర్మించి నీరు వెళ్లడానికి సరైన డ్రైనేజీ నిర్మాణం లేని కారణంగా వర్షం పడిన సమయంలో డ్రైనేజీలలో మురికి నీరు కాలువలలో నిలిచి దోమలు ఎక్కువగా వ్యాపిస్తున్నాయని డ్రైనేజీని పూర్తిగా నిర్మించి దోమల బెడద లేకుండా, మురికి నీరు నిలవకుండా పంచాయతీ అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని పంచాయతీ అధికారులు మురికి నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యవసాయ కూలీలకు జీవన భృతి ఇవ్వాలి

- సీపీఐ(ఎంఎల్) డిమాండ్

నవతెలంగాణ-గాంధారి

ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు జీవనభృతి ఇవ్వాలని, వ్యవసాయ కూలీల సమగ్రమైన చట్టం తేవాలని, ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన రూ.12 వేల పెన్షన్‌ను అమలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం (సీపీఐఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా నాయకులు ఏ ప్రకాష్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం దేశంలో 59శాతం మంది వ్యవసాయ రంగంలో పనిచేస్తున్నారని, ఇందులో రెక్కలు తప్ప ఎలాంటి ఆస్తులు లేని 14 కోట్ల మంది వ్యవసాయ కార్మికులేనని వివరించారు. నారు పోసిన నుంచి కోత కోసే వరకు వివిధ రకాలుగా పనులు చేస్తూ శ్రమను నమ్ముకుని జీవిస్తున్న వ్యవసాయ కార్మికులు చాలీచాలని వేతనాలతో బతుకీడుస్తున్నారని చెప్పారు. సరైన పనిలేక తక్కువ ఆదాయంతో అర్ధాకలితో అలమటిస్తున్నారని వివరించారు. వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ జరగడంతో ఉపాధి కోల్పోయి దిక్కుతోచని అయోమయమైన పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని తెలిపారు. ఎన్నికల సందర్భంగా రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అన్ని హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు శంకర్ రాజు, రాజేందర్, చందర్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

రైతుబంధుపై ప్రత్యేక సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

రైతుబంధు పథకంపై సోమవారం నాగిరెడ్డిపేట్ మండలంలో సహకార సంఘాల ఆధ్వర్యంలో రైతులతో ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని మండల ప్రత్యేక అధికారి రామ్మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో రెండు సొసైటీల పరిధిలో ఈ సమావేశం నిర్వహించారు. మాల్‌తుమ్మెద సొసైటీ పరిధిలో గల రైతులకు నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో గల రైతు వేదికలో సమావేశం నిర్వహించి దళితబంధుపై అభిప్రాయ సేకరణ నిర్వహించారు. అదేవిధంగా తాండూర్ సొసైటీ ఆధ్వర్యంలో తాండూరు గ్రామంలో గల సొసైటీలో తాండూర్ పరిధి రైతుల అభిప్రాయ సేకరణ నిర్వహించారు. రైతుబంధుపై రైతుల ద్వారా స్వీకరించిన అభిప్రాయలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపనున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ టేకులపల్లి వినీత, సొసైటీ చైర్మన్ ఆకిడి గంగారెడ్డి, వైస్ చైర్మన్ కృష్ణవేణి, మీద్దె బాబు, జెడ్పిటిసి మనోహర్‌రెడ్డి, ఏడిఏ వీరస్వామి, మాజీ చైర్మన్ రాజిరెడ్డి, ఏవో విజయ శేఖర్‌తో పాటు ఆయా సొసైటీల డైరెక్టర్లు వాసురెడ్డి, యాదయ్య, రామకృష్ణ, సిఇఓ పవన్, జైపాల్‌రెడ్డి, నికిత, భబిత పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పలువురు

విద్యతోనే జీవితంలో వెలుగు

- జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్ రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

విద్యతోనే జీవితంలో వెలుగు నిండుతుందని జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పోసానిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద మంజూరైన పనులను గ్రామాభివృద్ధి కమిటీ పూర్తి చేసి విద్యార్థులకు సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువచ్చినందుకు విడిసికి ధన్యవాదాలు తెలిపారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ప్రతి పాఠశాలకు సౌకర్యాల ఏర్పాట్లలో భాగంగా అమ్మ ఆదర్శ పాఠశాలతో నిధులు మంజూరు చేసి పాఠశాలల బలోపేతానికి కృషి చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పోతుల భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్కూల్‌లో వాటర్ ట్యాప్‌లను పరిశీలిస్తున్న నారెడ్డి మోహన్‌రెడ్డి

యూనియన్ బ్యాంక్ మేనేజర్‌గా సంజీవ్ కుమార్

నవతెలంగాణ-పిట్లం



మండల యూనియన్ బ్యాంక్ నూతన మేనేజర్‌గా సంజీవ్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గుజరాత్ రాష్ట్రం నుంచి బదిలీపై వచ్చారు. యూనియన్ బ్యాంక్ మేనేజర్‌గా పనిచేసిన ముఖేష్ కుమార్ గత నెలలో గుజరాత్ రాష్ట్రానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా మేనేజర్ సంజీవ్ కుమార్ మాట్లాడుతూ.. రైతుల, బ్యాంకు కస్టమర్ల అభ్యున్నతికి పాటుపడుతూ బ్యాంక్ లావాదేవీలపై ప్రత్యేక శ్రద్ధ వహించి బ్యాంకు దినదినాభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హరీష్ రావు తక్షణమే క్షమాపణ చెప్పాలి

● ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడు కొమిర శ్రీశైలం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

సీఎం రేవంత్ రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో పరోక్షంగా బీజేపీకి ఓట్లు వేయించారని అసత్యపు ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు తక్షణమే బేషరతుగా సీఎం రేవంత్ రెడ్డికి క్షమాపణ చెప్పాలని తెలంగాణ యూనివర్సిటీ ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు కొమిర శ్రీశైలం డిమాండ్ చేశారు. సోమవారం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్ కర్నూల్ నియోజకవర్గంలోని వంగూరు మండలం, కొండారెడ్డిపల్లి గ్రామంలో బీఆర్ఎస్ , బిజెపి లకు వచ్చిన ఓట్ల కంటే వెయ్యి ఓట్లకుపైగా కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ రావడం జరిగిందని తెలిపారు. హరీష్ రావు పూర్తి సమాచారం తెలుసుకోకుండా సీఎం రేవంత్ రెడ్డి పై దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అభివద్ధికి, సంక్షేమానికి, విద్యకు ఎంతో కషి చేస్తున్న తరుణంలో ఆలాంటి మాటలు మాట్లాడడం తగదని అన్నారు. సమావేశంలో రాజేందర్, మహేష్,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గోవింద్‌పేట్ సొసైటీ మహాజనసభ

నవతెలంగాణ-ఆర్మూర్



మండలం లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోవింద్ పేట్ నందు సోమవారం సంఘ అధ్యక్షులు బంటు మహిపాల్ అధ్యక్షతన అత్యవసర మహాజనసభ నిర్వహించినారు. రైతుబంధు పథకం అమలుపై రైతుల అభిప్రాయ సేకరణ వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి, వజీద్ హుస్సేన్, ఏవో హరికష్ణ, ఏడిఏ విజయలక్ష్మి , ఆడిటర్ పుష్ప ఏ ఈ ఓ శరత్ కుమార్,, ఎంపీటీసీ యాల్ల రాజ్ కుమార్ , వైస్ చైర్మన్ తూర్పు రాజన్న, డైరెక్టర్లు లక్కారం సాగర్, కొండ గంగాధర్, కాశిరెడ్డి శ్రావణ్, అప్పల భాస్కర్, నల్లూరి రమేష్, దార్ల గంగారం, ఎర్రం వంశీ, సీఈఓ. రమేష్ , వి డి సి సభ్యులు రొక్కం సాయి రెడ్డి, సంఘ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఎక్స్‌లెన్స్ అవార్డులు అందజేత



అవార్డులు అందుకున్న విద్యార్థులు, హాజరైన కోదండరాం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక (టివియువి) ఆధ్వర్యంలో నగరంలోని న్యూ అంబేద్కర్ భవనంలో టివియువి అకాడమీ ఎక్సెలెన్స్ అవార్డులు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా టివియువి అధ్వర్యంలో ఇంటర్‌లో అధిక మార్కులు సాధించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మానం చేయడం జరుగుతుందని అన్నారు. అకాడమీ ఎక్స్‌లెన్స్ అవార్డు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. ఇంటర్ ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా నుంచి రాష్ట్రంలో నెం-1 ర్యాంకు సాధించిన అంకితను అభినందించారు. చదువు మధ్యలో ఆగిపోద్దని, ప్రయాణంలో ఇంటర్ విద్య మొదటి అడుగని, ప్రతి సంవత్సరం ఉన్నత చదువుల్లో ఇలాంటి అవార్డులను తీసుకోవాలని అన్నారు. నిరుద్యోగ సమస్యలకోసం విద్యార్థులు ఉద్యమాలు చెయ్యాలి తప్ప ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయే విధంగా ఉద్యమాలు చెయ్యొద్దని అన్నారు. నిరుద్యోగ సమస్యలకోసం ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న మోతిలాల్ దీక్ష విరమణ చేయ్యాలని కోరారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని చెప్పారు. తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు రమేష్ మాట్లాడుతూ.. ముదిరాజ్ విద్యార్థులు లక్ష్యాలతో చదివితే విజయం స్వంతం అవుతుందని అన్నారు. డిఐఈఓ రవికుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో అధికంగా మహిళలలు టాపర్లు నిలిచారని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ అడ్వకెట్ ఆశ నారయణ, టిజెయస్ జిల్లా ఇంఛార్జి లక్ష్మణ్ యాదవ్ టివియువి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లాల్ సింగ్, టివియువి జిల్లా ఇంచార్జి నవీన్ టివియువి, జిల్లా కన్వీనర్ అజయ్, సుభాష్ సన్నీ, అజయ్ తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ఐదు ఎకరాలకు రైతుబంధు ఇవ్వాలి

● సింగిల్ విండో చైర్మన్ నాగుల శ్రీనివాస్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని కొలిప్యాక్ సింగిల్ విండో పరిధిలో మహాజన సభ సింగిల్ విండో అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు బంధు పై రైతుల అభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ నాగుల శ్రీనివాసు మాట్లాడుతూ ఒక కుటుంబంలో ఎంత మంది రైతులు ఉంటే అంతమందికి రైతుబంధు ఇవ్వాలని, కనీసం ఒక రైతుకు ఐదు ఎకరాల వరకు రైతుబంధు ఇవ్వాలని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారులు మండల వ్యవసాయ అధికారి దేవిక కొలిప్యాక్ చింతలూరు కలిగోటు మనోహరాబాద్ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు దోస్త్ ప్రత్యేక కేటగిరి వారి ధ్రువపత్రాల పరిశీలన

నవతెలంగాణ-డిచ్‌పల్లి

దోస్త్ ఆన్లైన్ డిగ్రీ ప్రవేశానికి 2024 -25 సంవత్సరానికి రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రత్యేక కేటగిరి విద్యార్థులకు తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ధ్రువపత్రాల పరిశీలన అకాడమిక్ ఆడిట్ సెల్‌లో మంగళవారం ఉదయం 10:30 నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటుందని దోస్త్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్ కే.సంపత్ కుమార్ తెలిపారు. పిహెచ్‌సి (దివ్యాంగులు) సిఏపి, ఎన్‌సిసి, ఎక్స్‌ట్రా కర్యూలర్ ఆక్టివిటీస్ విద్యార్థినీ విద్యార్థులకు మాత్రమే సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని ఆయన తెలిపారు.

స్కాలర్స్ పాఠశాలలో గ్రీన్ డే సంబరాలు



ఆకుపచ్చ రంగు బొమ్మలతో విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని వెంకటేశ్వర కాలనీ స్కాలర్స్ ఒలంపియాడ్ పాఠశాల యందు సోమవారం గ్రీన్ డే సంబరాలు ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ తాళ్ల వేణు మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు చిన్ననాటి నుండి చదువుతో పాటు సంబరాలు నిర్వహిస్తూ వారిని ఉన్నత స్థాయికి చేర్చేందుకు కషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గుమ్మాల ఒడ్డెన్న, వైస్ ప్రిన్సిపాల్ సహస్ర, పాఠశాల ఇంచార్జ్ అనిత, ఉపాధ్యాయ బందం తదితరులు పాల్గొన్నారు.

సర్కిల్ టోర్నీ విజేతగా పురాణిపేట్

నవతెలంగాణ-భీంగల్ రూరల్



విజేతగా నిలిచిన పురాణిపేట్‌టీం

మండలంలోని పురానిపేట్ గ్రామంలో వారం రోజుల నుండి నిర్వహిస్తున్న సర్కిల్ టోర్నమెంట్‌లో పురాణపేట్ టీం విజేతగా నిలించింది. ఈపోటీల్లో 30 జట్లు పాల్గొన్నాయి. ఇందులో మొదటి బహుమతిగా 8వేలు, ద్వితీయ బహుమతిగా 4వేలు నిర్ణయించినట్టు తెలిపారు. టాస్ ఓడిపోయి మొదట బ్యాటింగ్ చేసిన బాబాపూర్ జట్టు నిర్ణిత 6 ఓవర్లలో 65 రన్స్ చేయగా దానిని పురాణిపేట్ టీం 5.3 ఓవర్లలో ఛేదించింది. మొదటి బహుమతి పొందిన పురాణిపేట్ టీంకు బహుమతుల ప్రదానోత్సవానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన దైడి సురేష్, సుంకరి గాంధీ విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా దైడి సురేష్, సుంకరి గాంధీ మాట్లాడుతూ.. అందరూ గెలుపుని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్లాలని, ఈ క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని తెలిపారు. ఈ టోర్నమెంట్‌ను విజయవంతంగా ముగించిన మేనేజ్మెంట్ చరణ్, అజయ్, హరీష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

వైద్యులు ప్రాణదాతలు

● జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా వైద్యులకు సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే, చార్టెడ్ అకౌంటెంట్ డే దినోత్సవాలను పురస్కరించుకొని సోమవారం ప్రముఖ డాక్టర్లను, సీఏ లను ఘనంగా సన్మానించారు. వైద్యులు హరినారాయణ్ , రమణ, వెంకట్ గౌడ్ దంపతులు , ముత్యం రెడ్డి దంపతులు, ఫిజియోథెరపీ రాజు, హెూమియోపతి రాంప్రసాద్ , పిల్లల వైద్య నిపుణులు అజయ్, సిఏలు మారుతి, పవన్ ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు గుజరాతి నివేదన్ మాట్లాడుతూ.. సమాజంలో వైద్యుల పాత్ర ఎంతో గొప్పదని అన్నారు. 1991నుండి దేశంలో డాక్టర్స్ డే నిర్వహిస్తున్నారని తెలిపారు. స్వతంత్ర సమరయోధుడు, రాజకీయవేత్త, ప్రముఖ వైద్యులు భారత రత్న పురస్కార గ్రహీత బిధాన్ చంద్రా రాయ్ స్మరాకార్థం ఈ కార్యక్రమాన్ని జరుపుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు బెల్దార్ శ్రీనివాస్, డిజె సునీల్, బొగడమీది కిషన్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో..

తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.సుజాత అధ్యక్షతన డాక్టర్ల దినోత్సవం, చార్టర్ అకౌంటెంట్ దినోత్సవం పురస్కరించుకొని, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సన్మాన సభను ఏర్పాటు



పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ అజయ్‌ను సన్మానిస్తున్న జీజీ

చేశారు. ఈ కార్యక్రమానికి పట్టణంలోని ప్రముఖ వైద్యులు డాక్టర్ అపర్ణ, గైనకాలజిస్ట్ డాక్టర్ ప్రకాష్, ఆర్థోపెడిక్, చార్టర్ అకౌంటెంట్ ఈరవర్తి రాజశేఖర్ విచ్చేశారు. డాక్టర్ అపర్ణ మాట్లాడుతూ.. విద్యార్థులకు గైనిక్ సమస్యలు, వాటి నివారణ మార్గాలను, ముఖ్యంగా అమ్మాయిలకు పోషక విలువలతో కూడిన ఆహారం గురించి తెలిపారు. విద్యార్థులు వారి సమస్యలను అడగగానే డాక్టర్ అపర్ణ సమాధానాలను ఇచ్చారు. ఆర్థోపెడిక్ డాక్టర్ ప్రకాష్ ప్రతి మనిషి ఎదుగుదలకు కాల్షియం ఎంత అవసరమో దానికి ఎలాంటి పదార్థాలను స్వీకరిం చాలో తెలియజేశారు. చార్టర్ అకౌంటెంట్ ఈర వర్తి రాజశేఖర్ చార్టర్ అకౌంటెంట్‌లో ఎన్ని పేపర్లు ఉంటాయి, ఎలా చదువుకోవాలి, పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో వివరంగా విద్యార్థులకు తెలుపుతూ, చార్టర్ అకౌంటు యొక్క ప్రాముఖ్యతను కూడా తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మోత్కూరి లింగాగౌడ్ , విచ్చేసి విద్యార్థులకు వారి భవిష్యత్తులను ఎలా తీర్చిదిద్దుకోవాలో తెలుపుతూ,దానికి చదువు ఒకటే మార్గమని, అది ఈ గురుకులాల్లో కచ్చితంగా లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కామర్స్ లెక్చరర్ జి అంబిక, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యులు మధు శేఖర్‌కు సన్మానం..

నేషనల్ డాక్టర్స్ డే సందర్భంగా డాక్టర్ మధుశేఖర్‌కు ఎంజే హాస్పటల్లో రజక ఐక్య వేదిక జిల్లా యువజన కమిటీ అధ్యక్షులు మీర శ్రావణ్ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఈ సందర్భంగా మీర శ్రావణ్ మాట్లాడుతూ వైద్యులు ప్రాణాన్ని కాపాడేవారే వైద్యులని అన్నారు, డాక్టర్ మధుశేఖర్ అతి తక్కువ ఫీజుతో వైద్యం చేస్తారని ఎంతో మంది నిరుపేదలకు ఉచితం వైద్యం చేశారని అన్నారు. ఎన్నో మెడికల్ క్యాంప్‌లు నిర్వహించారని తెలిపారు. చేయూత ఫౌండేషన్ ద్వారా అనేక సేవలు చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో మక్లూర్ రాజు, బజమొల్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంక్షేమ సేవ సమితి ఆధ్వర్యంలో ....

డాక్టర్ బిదాన్ చంద్ర రాయ్ జన్మదినం సందర్భంగా జాతీయ డాక్టర్స్‌డేను పద్మశాలి సంక్షేమ సేవ సమితి ఆధ్వర్యంలో డాక్టర్ ప్రకాశ్ ఆర్థోపెడిక్, రుద్ర శ్రీనివాస్, రాం ప్రసాద్, చిలుక శ్రీనివాస్ హెూమియో వైద్యులు, రణవీర్, అమర్ నాథ్, కావ్య చైల్డ్ స్పెషలిస్ట్, దోపతి ప్రవీణ్ కుమార్, గంగాధర్ పిఎంపిలను సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంక్షేమ సేవ సమితి అధ్యక్షులు మ్యాక మోహన్ దాస్, కార్యదర్శి కొక్కుల రమాకాంత్ మాట్లాడుతూ ప్రజల మెరుగైన ఆరోగ్యం కోసం తమ జీవితాలను అంకితం చేస్తూ ,నిరంతరం చేస్తున్న సేవలను గుర్తిస్తూ పద్మశాలికి చెందిన డాక్టర్స్‌ను జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా సన్మనించినట్టు తెలిపారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం తర్పల అధ్యక్షులు నూకల నారాయణ, బండి అనంత రావు, రుద్ర రాజేశ్వర్, సైభ సుధాకర్, ఏముల ప్రకాశ్,సదమస్తుల గణపతి, మోర్తాడ్ మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు రవి కాక,సభ్యులు పాల్గొన్నారు.

వ్యాధులను అరికట్టేలా పనిచేద్దాం : ఎంపీడీవో

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండల పరిషత్ అభివద్ధి అధికారి జి సంతోష్ కుమార్ బెజ్జోరా, లింగాపూర్ గ్రామాలను సందర్శించినారు ఈ సందర్శనలో భాగంగా బెజ్జోర గ్రామంలో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు వర్షాకాలం సీజన్ ప్రారంభమైనందున రోగాలు రాకుండా ఉండేందుకు నిల్వ ఉన్న నీటిని తొలగించాలని, మురికి కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, క్రమం తప్పకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లాలని ఆదేశించారు. లింగాపూర్ గ్రామంలో హరితహారం నర్సరీని సందర్శించారు. పారిశుధ్యంపై సమీక్ష నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన మంకీ ఫుడ్ కోర్ట్ పనులను సందర్శించి సంతప్తి వ్యక్తం చేశారు. వర్షాకాలం సీజన్ ప్రారంభమవుతుంది కావున హరితహారం యాక్షన్ ప్లాన్ పూర్తిచేసి పనులు ప్రారంభించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.



మురుగు కాలువలో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లుతున్న కార్మికుడు

నాటేందుకు మొక్కలను సిద్ధంగా ఉంచాలి

● ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

వర్షాలు కురుస్తున్నందున మండల కేంద్రంలో నాటేందుకు అవసరమైన మొక్కలను సిద్ధంగా ఉంచాలని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అన్నారు.నర్సరీల్లో నిర్దేశించిన లక్ష్యం మేరకు వివిధ రకాల మొక్కలను సిద్ధం చేయాలన్నారు. సోమవారం మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీని ఆయన సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున నాటేందుకు నిర్దేశించిన లక్ష్యం మేరకు నర్సరీలో మొక్కలను సిద్ధంగా ఉంచాలన్నారు. గతంలో నాటిన మొక్కలు చనిపోయిన, ఎండిపోయిన చోట కొత్త మొక్కలను నాటించాలని ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. మొక్కలు నాటేంతవరకు నీటిని అందించాలన్నారు. నాటిన మొక్కల్లో 60 శాతం పైగా మొక్కలు బతికేలా తగిన చర్యలు చేపట్టాలన్నారు. నర్సరీ నిర్వహణ పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సదానంద్, పంచాయతీ కార్యదర్శి శాంతి కుమార్, తదితరులు పాల్గొన్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

సుశ్రుత హాస్పిటల్ ఆధ్వర్యంలో ఫ్రీహెల్త్ క్యాంపు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని శ్రీ సరస్వతీ విద్యా మందిర్ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థిని డాక్టర్ మౌనిక రెడ్డి (2001-02)బ్యాచ్, మోర్తాడ్ శిశు మందిర్ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థి డాక్టర్ గణేష్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఫ్రీ హెల్త్ క్యాంప్ కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ హాస్పిటల్ అయిన సుశ్రుత పిల్లల దవాఖానా జనరల్ హాస్పిటల్ వారి సారథ్యంలో డాక్టర్స్‌డే సందర్భాన్ని పురస్కరించుకొని ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహించారు. శ్రీ సరస్వతీ విద్యా మందిర్ పాఠశాలలో చదువుకొని డాక్టర్లుగా సేవలను అందిస్తున్న తాము చదువుకున్న పాఠశాలలో ఫ్రీ హెల్త్ క్యాంప్ ద్వారా కొంత మందికి అయినా అనారోగ్య సమస్యల పరిష్కారానికి కషి చేసి ఉచిత మందులు అందించడం తమకు ఆనందంగా ఉందని డాక్టర్ మౌనిక రెడ్డి, డాక్టర్ గణేష్ రెడ్డి తెలిపారు. దాదాపుగా 300 మంది వరకు పిల్లలు, పెద్దలు పాల్గొన్నారని, వారికి ఉచిత మందుల పంపిణీ కూడా చేయడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల జిల్లా కార్యదర్శి రవినాథ్, ప్రభంధన కారిణి కమిటీ అధ్యక్షులు వంశిక్రిష్ణ, జనార్దన్ కిరణ్, రవికాంత్, పాఠశాల ప్రిన్సిపల్ వినోద్ కుమార్, మేనేజ్మెంట్ భానుతేజ, అభిమన్యు, మాతాజీలు సోనాలి, శైలజ, మంజుల, లత, వేద, నిహారిక, ప్రియాంక, ప్రత్యూష, సింధూజ, విద్యార్థులు ,పేరెంట్స్ పాల్గొన్నారు.



మందులు రాస్తున్న వైద్యురాలు

కనిపించని ప్రజావాణి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలో మండల అధికారుల సమక్షంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించవలసి ఉండగా మండల ప్రధాన కార్యాలయాల్లో ఎక్కడ కూడా ప్రజావాణి కార్యక్రమం కనిపించలేదు. ట్రాన్స్కో అధికారులు కూడా ప్రజావాణి కార్యక్రమం నిర్వహించవలసి ఉండగా అక్కడ కూడా ప్రజావాణి నిర్వహించలేదు. ప్రజావాణి కార్యక్రమము నిర్వహించాలని కలెక్టర్ ఆదేశాలు ఉండగా మండలంలో ఎక్కడ కూడా ప్రజావాణి కార్యక్రమం నిర్వహించట్లేదంటే అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనిపిస్తోంది.

కొనసాగుతున్న పనులకు శంఖుస్థాపన



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలోని లక్మాపూర్ గ్రామ శివారులోగల గుత్ప ఎత్తిపోతల పంపు హౌజ్‌ను ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, జిల్లా జెడ్పీ చైర్మన్ డి. విఠల్ రావు సోమవారం శంకుస్థాపన చేశారు. ముల్లంగి, బొంకన్‌పల్లి గ్రామాలకు సాగు నీరు అందించేందుకు పనులు కొనసాగుతుండగానే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల రైతులకు సుమారు వెయ్యి ఎకరాలకు సాగు నీరు అందించేందుకు రూ. 11.71 కోట్ల నిధులను మంజూరుకు కృషి చేసిన జెడ్పీ చైర్మన్ విఠల్ రావుకు రెండు గ్రామాల ప్రజలు, రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటి వరకు రూ.ఆరుకోట్ల పనులు పూర్తి అయ్యాయని, మిగతా పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు వారు సూచించారు. ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ పైలెట్ ప్రాజెక్ట్ మోడల్ స్కూల్‌ని ఆర్మూర్‌కు తెచ్చేంత వరకు ఊరుకోనని అన్నారు. ఇచ్చిన రూ. వంద కోట్లను ఉప ముఖ్యమంత్రి తీసుకెవెళ్లారని, మేము ఎమ్మెల్యేలము కాదా.. అంటూ సీఎం రేవంత్‌ని హెచ్చరించారు. నిధుల కోసం ప్రజా ఉద్యమాలు, ఆమరణ నిరహార దీక్ష చేయడానికి సిద్ధం అన్నారు. గ్రామాల్లో కార్యకర్తలు ఐదు లక్షల నిధుల కోసం కొట్టుకుంటుంటే మంత్రులు కోట్లకు కోట్లు పట్టుకెళుతున్నారన్నారు. అధికార కార్యకర్తలు అందరూ గమనించాలని తెలిపారు. మాక్లూర్ సొసైటీలో ఎవడు ఎన్ని తిన్న మొత్తం కక్కిస్తానని, వారి వెనక ఎవ్వరు ఉన్న వదిలే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ అశోక్, ఎంపీడీఓ క్రాంతి, తహసిల్దార్ షబ్బీర్, ఇరిగేషన్ అధికారులు, రెండు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

8న కలెక్టరేట్ వద్ద ధర్నా జయప్రదం చేయండి

● తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఈనెల 8 న కలెక్టరేట్‌వద్ద బీడీకార్మికులతో ధర్నా నిర్వహిస్తున్నట్టు తెలంగాణ ప్రగతిశీలబీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చింతా భూమేశ్వర్, ప్రధాన కార్యదర్శి బి.సూర్య శివాజీ అన్నారు. నగరంలోని కోటగల్లీ లోగల ఎన్ఆర్ భవన్‌లో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీడీ కార్మికు లకు చేయూత పథకం కింద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇస్తానన్న 4వేల రూపాయలు బీడీ కార్మికులందరికీ ఆంక్షలు లేకుండా ఇవ్వాలని, కనీస వేతన జీవో విడుదల చెయ్యాలని తెలిపారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వస్తే బీడీ కార్మికులకు చేయూత పథకం కింద 4వేలు రూపాయలు ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించారని అన్నారు. ముఖ్య మంత్రి అయి ఆరు నెలలు గడిచిపోతున్న నేటి వరకు అమ లు చేయలేదని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేర కు బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న బీడీ ప్యాకింగ్, చాటన్, నెల సరి ఉద్యోగులకు ఆంక్షలు లేకుండా ఇవ్వాలని అన్నారు.

నెలకు రూ.2016 వస్తున్న వారికి కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీడీ పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలి వేతనాలు పెరగటం లేదని గత 14 సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వాలు జీవో విడుదల చేయటం లేదని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి పెరుగుతున్నధరలకు అనుగుణంగా కనీస వేతన జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాజీనామా చేసిన కార్మికులకు పెన్షన్ 800 నుండి 1100 రూపాయలు మాత్రమే వస్తుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాజీనామా చేసిన కార్మికులందరికీ కనీస పెన్షన్ 10వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజీనామా చేసిన కార్మికులు పీఎఫ్ డబ్బులు, పెన్షన్ కోసం ఆన్లైన్‌లో అప్లై చేస్తే తప్పొప్పులు ఉన్నాయని చెప్పి కార్మికులను నెలల తరబడి తింపుతున్నారని అన్నారు. ఆన్లైన్లో ఆప్షన్ ఇవ్వకుండా ఇబ్బందుల గురి చేస్తున్నారని ఆరోపించారు. పదవి విరమణ పొందిన కార్మికులు వృద్ధాప్యం వల్ల ఆఫీస్‌ల చుట్టూ తిరగలేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. కార్మికులను ఇబ్బందుల గురి చేస్తున్న పిఎఫ్ అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి కార్మికుల తప్పొప్పులను సరిచేసి పీఎఫ్ పెన్షన్ సమస్యలు పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీనిపై కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. నిజామాబాద్ ధర్నా చౌక్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమంలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల రాములు, రాష్ట్ర సహాయ కార్యదర్శి కాజ మోహినుద్దీన్, రాష్ట్ర కోశాధికారి సామల గంగాధర్, జిల్లా కార్యదర్శి జేపీ గంగాధర్, రాష్ట్ర నాయకులు ఎం.శివకుమార్, వి.పద్మ ఎం. సుప్రియ, తిరుమల్, ఎస్. రాజేష్ వెంకటేష్, పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

పీఎం జెజెబివై చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న మేనేజర్ శిబాని సెతి

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూరు పట్టణానికి చెందిన ధనుంజయ్ ఎస్‌బిఐ సర్వీస్ పాయింట్ (శ్వేత)లో రూ.436 చెల్లించి ప్రధానమంత్రి సురక్ష యోజన (పిఎం జెజెబివై) ఇన్సూరెన్స్ చేసుకున్నారు. ఇటీవల కాలంలో ధనుంజయ్ మరణించగా బాధితుడికి పిఎం జెజెబివై పథకంలో భాగంగా మంజూరైన ఇన్సూరెన్స్ రూ.2లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు ఎస్‌బిఐ మేనేజర్ శిబాని సెతి సోమవారం అందజేశారు. అనంతరం ఎస్‌బిఐ మేనేజర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకొని ఇన్సూరెన్స్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

5

నిజామాబాద్-కామారెడ్డి

మంగళవారం | జులై 02, 2024 | www.navatelangana.com

కూటికోసం చెత్త సేకరణ

నవతెలంగాణ-మద్నూర్

శ్రద్ధతో బడికి వెళ్లాల్సిన పిల్లలు.. వీధుల్లో తిరుగుతున్నారు. పుస్తకాలు పట్టాల్సిన చేతులు.. పారేసిన చెత్తను సేకరిస్తున్నాయి. ఆనందంగా బడిలో పాఠాలు నేర్వాల్సిన ఆ బాలురు.. పొట్టకూటికోసం దిక్కుతోచని స్థితిలో ఉంటున్నారు. అందుకు నిదర్శనం పై చిత్రమే. పూట గడవక పాఠశాలకు వెళ్లాల్సిన ఇద్దరు బాలురు ఇలా చెత్తను సేకరించి ఆ సంచులను భూజాలకెత్తుకుని వెళ్లారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తెచ్చినా కొందరు చిన్నారుల బతుకులు మారడం లేదు.


చెత్తసంచులతో బాలురు

వైద్యుల సేవలు మరువలేనివి

- ఘనంగా డాక్టర్స్ డే
- పలువురు వైద్యులకు సన్మానం

నవతెలంగాణ-బోధన్

సమాజంలో వైద్యుల సేవలు మరువలేనివని లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ అధ్యక్షులు నాగేశ్వరరావు అన్నారు. సోమవారం అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం పురస్కరించుకొని బోధన్ లయన్స్ క్లబ్ కంటి ఆస్పత్రిలో వైద్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నవారికి వైద్యం అందించి పునర్జన్మనిస్తున్న వైద్యులు ఎందరో ఉన్నారని తెలిపారు. అలాగే ప్రముఖ వైద్యులు డాక్టర్ సునీల్ కుమార్ చౌదరిని పాత్రికేయులు డాక్టర్స్ డే సందర్భాన్ని పురస్కరించుకొని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యులు కే. శ్రీనివాస్,జ్యోతి చవాన్, సరస్వతి, ఫిఫావత్, అబ్దుల్ రజాక్ లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి వ్యవస్థాపకులు బసవేశ్వర్ రావు, చైర్మన్ నరసింహారెడ్డి, మాజీ డిస్టిక్ క్యాబినెట్ సెక్రెటరీ వై. శ్రీనివాసరావు, మాజీ కోశాధికారి కొడాలి కిషోర్, డిస్టిక్ చైర్ పర్సన్ శ్యాంసుందర్ పహాడే, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సెక్రటరీ ఉమేష్ షిండే, కోశాధికారి సురేంద్ర చౌదరి, తదితరులు పాల్గొన్నారు.



బోధన్ : వైద్యులను సన్మానిస్తున్న దృశ్యం


ఎడపల్లి : ఆస్పత్రిలో మాట్లాడుతున్న వైద్యాధికారిణి సాహిస్తా ఫిర్దోస్ బేగం

వైద్యులకు సన్మానం..

ఎడపల్లి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిని శాయిదా ఫిర్దోస్ బేగం, ఆయుష్ వైద్య అధికారి వెంకటేషంను లయన్స్ క్లబ్ ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ ఆఫ్ ఎడపల్లి అధ్యక్షులు గండి మనోజ్ కుమార్, కార్యదర్శి రాకేష్ వర్మ కోశాధికారి గంగారెడ్డి, బంజశంకర్, నార్ల కాశీనాథ్‌గుప్తా, కదం ప్రకాష్‌రావు, జిల్లా ఆర్గనైజర్ కరటూరి సూర్యనారాయణ, వైద్యులు వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడమే వైద్యుల లక్ష్యమని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని సాహిస్తా (శాహిదా)ఫిర్దోస్ బేగం అన్నారు. మండల కేంద్రంలోని జాతీయ వైద్యుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే ఎడపల్లి మండల ఆయుర్వేదిక్ వైద్యాధికారి వెంకటేష్ మాట్లాడుతూ.. కరోనా సమయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య శిబిరంతో పాటు ఆశావర్కర్లు అందరం ఐక్యతతో కలిసి మెలిసి ఉండి కరోనాను నివారించేందుకు గ్రామీణ ప్రాంత ప్రజలతో పాటు ఆసుపత్రికి వచ్చే రోగులకు సూచనలు, సలహాలు చేసినట్టు గుర్తు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు రాజేశ్వర్, దేవేందర్, భారతి, స్టాఫ్‌నర్స్ సుమలత, ఫార్మసిస్ట్ విజయలక్ష్మి, కర్రే మధుసూదన్, ఎంఎల్‌హెచ్‌పిలు శివ, పావని, సాత్విక, శైలజ, ఏఎన్ఎంలు గంగమణి, రేఖ శాంత, లక్ష్మి గంగమణి, రాణి, సరిత, ఆసుపత్రి వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు,

విద్యార్థులకు ఇబ్బందులుండొద్దు

- ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు

నవతెలంగాణ-మద్నూర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులుండొద్దని ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు అన్నారు. సోమవారం గురుకుల పాఠశాల ఉపాధ్యాయులతో ప్రత్యేకంగా రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండలంలోని పెద్ద ఎక్లారా గేటు వద్ద సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యాబోధన మెనూ సౌకర్యాలు సక్రమంగా అందించాలని అన్నారు. పాఠశాలలో చదువుకునే బాలికలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో బలవర్థకం


పిల్లలకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్

నవతెలంగాణ-జుక్కల్

పౌష్టికాహారంతో పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు బలవర్థకంగా ఉంటుందని మాదాపూర్ అంగన్‌వాడీ టీచర్ నర్సుబాయి అన్నారు. సోమవారం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నపిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. బాలింతలకు, గర్భిణులకు, పౌష్టికాహారం బాలమృతం, గుడ్లు తదితర పదార్థాలు అందించారు. బాలింతలకు రక్తహీనత కలగకుండా నిత్యం పాలు, గుడ్లు, పౌష్టికాహారం అందిస్తున్నామని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు పొంచి ఉన్నందున జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీచర్ నర్సుబాయి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.


రైతు భరోసా సమావేశం

నవతెలంగాణ-మద్నూర్

వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘం సింగిల్ విండో కార్యాలయంలో ఈ నెల 3న ఉదయం 10 గంటలకు రైతు భరోసా సమావేశాన్ని సహకార సంఘం చైర్మన్ శ్రీనివాస్ పటేల్ అధ్యక్షతన నిర్వహించనున్నట్టు సింగిల్ విండో కార్యదర్శి జే.బాబురావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సంఘం కార్యవర్గ సభ్యులు, సింగిల్‌విండో పరిధిలోని వ్యవసాయ రైతులు సకాలంలో హాజరుకావాలని కార్యదర్శి తెలిపారు.

సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరిస్తాం

- బిఆర్ఎస్ ఎంపీటీసీలు



నవతెలంగాణ-భిక్కనూర్

పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించనున్న మండల సర్వసభ్య సమావేశాన్ని బిఆర్ఎస్ పార్టీ జడ్పిటిసి, ఎంపీటీసీలు, సింగిల్ విండో అధ్యక్షులు బహిష్కరిస్తున్నట్లు వైస్ ఎంపీపీ యాదగిరి తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సర్వసభ్య సమావేశానికి ఎలాంటి రాజ్యాంగబద్ధమైన హెూదా లేని షబ్బీర్ అలీని ప్రత్యేక ఆహ్వానితులుగా స్థానిక ఎంపీపీ గాల్‌రెడ్డి, ఎంపీటీసీలను సంప్రదించకుండా సమావేశం ఏర్పాటు చేసినందున బహిష్కరిస్తున్నామని తెలిపారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ఎమ్మెల్యేని పిలిచినా సమావేశానికి గౌరవం ఉండేదని తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సొసైటీ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, భూమ్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు సాయిరెడ్డి, మాజీ సర్పంచ్ వేణు, నాయకులు ప్రభాకర్, బాలాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలి

- కందకుర్తి గ్రామస్తుల రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న నిరుపేదలు

నవతెలంగాణ-రెంజల్

నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని మండలంలోని కందకుర్తి గ్రామంలోని నిరుపేదలు కోరారు. సోమవారం ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. వెంటనే తమకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయం తెలిసిన వెంటనే తహసీల్దార్ శ్రావణ్ కుమార్ అక్కడికి వెళ్లి పరిస్థితులను సమీక్షించారు. అర్హులైన నిరుపేదల నివేదికను తీసుకొని సంబంధిత అధికారులతో చర్చించి కేటాయించడానికి తనవంతు సహాయ సహకారాలను అందజేస్తారని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

పంచాయతీ కార్యదర్శి అంజయ్య ఉద్యోగ విరమణ


కార్యదర్శి అంజయ్యను సన్మానిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని అంజనీ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న అంజయ్య ఉద్యోగ విరమణ సందర్భంగా సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయనను ఎంపీపీ ప్రతాపరెడ్డి, ఇంచార్జ్ ఎంపీడీవో సూర్యకాంత్ సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెండున్నర సంవత్సరాల కాలంలో అంజనీ గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించిన అంజయ్య సేవలు మరవలేనివని అన్నారు. గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు చాలా కృషి చేశారని తెలిపారు. గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామాల్లో ఏ సమస్యలున్నా వారి దృష్టికి రాగానే గ్రామంలో ఉన్న తాగునీరు మురికి కాలువలు అంతర్గత రోడ్లు శుభ్రపరచుట ఇటువంటి అనేక కార్యక్రమాలో చురుగ్గా విధులు నిర్వహించేవారని తెలిపారు. ఆయన పనితీరును అందరూ ఆదర్శంగా తీసుకొని గ్రామాలను అభివృద్ధి పథంలో వెళ్లే విధంగా మిగతా పంచాయతీ సెక్రటరీలు కృషి చేయాలని ఆయన అన్నారు. అనంతరం ఆంజయ్యను అధికారులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు శాలువాలతో సన్మానించి స్వీట్లు తినిపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాప్ రెడ్డి, కో ఆప్షన్ మెంబర్ జాపర్ షా, ఇంచార్జి ఎంపీడీఓ సూర్యకాంత్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొత్త చట్టాల ప్రకారం కేసు నమోదు

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని గండివేట్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ టీవీని పగులగొట్టిన ఘటనలో కొత్త చట్టాల అమలు 1 జులై 2024లో భాగంగా భారతీయ న్యాయ సంహిత ప్రకారం కేసు నమోదు చేసినట్టు గాంధారి ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. గండివేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం యధావిధిగా స్కూలులోని అన్ని గదులకు తాళాలు వేసి వెళ్లారు. సోమవారం ఉదయం 9 గంటలకు వచ్చి చూసేసరికి 8వ తరగతి కిటికీలోనుంచి గుర్తు లేని వ్యక్తులు రాళ్లు విసరడం వల్ల డిజిటల్ టీవీ పగిలిపోయిందని ఇన్చార్జి ప్రధానోపాధ్యాయుడు రమేష్ ఫిర్యాదు మేరకు కొత్త చట్టంప్రకారం కేసు నమోదు చేసినట్టు తెలిపారు. కొత్త చట్టంలో శిక్షలు పెరగడం వల్ల నేరాలు తగ్గుతాయని వివరించారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

- తహసీల్దార్లు వెల్లడి
- పలు మండలాల్లో కొనసాగిన ప్రజావాణి

నవతెలంగాణ-విలేకరుల బృందం

మద్నూర్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ ఎండి ముజీబ్ తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ, ఎంపీవో, ఎంఈవో, ఐసీడీఎస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


పెద్దకొడప్‌గల్ : ప్రజావాణిలో ఫిర్యాదు

ప్రజావాణికి ఫిర్యాదులు నిల్..

దోమకొండ : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సంజయ్ రావు ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. కాగా ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్, ఎంపీవో తిరుపతి, ఆర్ఐ మహేందర్, మండల అధికారులు పవన్ కుమార్, బాల కృష్ణ పాల్గొన్నారు.


మద్నూర్ : ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు

ప్రజావాణిలో 6 ఫిర్యాదులు..

పెద్దకొడప్‌గల్ : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని తహశీల్దార్ దశరథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామప్రజలు పాల్గొని తమకు ఉన్న సమస్యలను రాత పూర్వకంగా ఆయా శాఖల అధికారులకు అందజేశారు. అధికారులు ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. తలబ్ తాండ మాజీ సర్పంచ్ గణపతి రావు ధరణి పార్ట్ బి లో ఉన్న భూముల గురించి అధికారులకు ఫిర్యాదు చేశారు. 1955 నుంచి ఈ భూములలో రైతులు సాగు చేసి పంటలను పండిస్తు జీవనం సాగిస్తున్నారని దీనికి అధికారులు స్పందించి పార్ట్ బిలో ఉన్న భూములను పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. మండల కేంద్రానికి చెందిన బొందిలి నంద బాయి రేషన్ కార్డులో ఆధార్ నంబర్ తప్పుగా ముద్రించడం వల్ల ప్రభుత్వం నుండి రావాల్సిన బియ్యం అందడంలో ఇబ్బంది అవుతుందని దీనిని సరి చేసి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దశరథ్, ఇంచార్జి ఎంపీడీఓ సూర్యకాంత్, వీవోఏ రవీందర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

భిక్కనూర్ : భిక్కనూర్ పట్టణంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదులు వచ్చినట్లు తహసీల్దార్ శివ ప్రసాద్ తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యల పరిష్కారం కొరకు ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేసి సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రాంగణ నియామకాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఉషోదయ కళాశాల డైరెక్టర్ దుష్యంత్

నవతెలంగాణ-బోధన్

జులై మూడవ తేదీన ఉషోదయ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ప్రాంగణ నియామకాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఉషోదయ కళాశాలలో డైరెక్టర్ దుశాంత్ అన్నారు. సోమవారం డిగ్రీ కళాశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంగణ నియామకాలలో జస్ ప్యాక్ట్ కంపెనీ, ఎం.ఎస్.సీ, కంపెనీలు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నాయని తెలిపారు. బీకాం, బీఎస్సీ, బీటెక్, ఎంబీఏ చదివిన వారు ప్రాంగణ నియామకాలకు హాజరుకావాలని పేర్కొన్నారు. 2022-24 సంవత్సరంలో డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఆధార్ కార్డు, రెజ్యూమ్, పాస్‌పోర్ట్ ఫోటోలు, అన్ని డిగ్రీ సర్టిఫికెట్లను వెంట తీసుకురావాలని పేర్కొన్నారు. గత 2015 నుంచి ప్రతి సంవత్సరం బోధన్ పట్టణంలో కార్పొరేట్ డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలలకు ధీటుగా క్యాంపస్ సెలక్షన్స్ చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటివరకు ఎందరో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు వచ్చాయన్నారు. ఉషోదయ కళాశాలలో క్యాంపస్ సెలక్షన్‌లో ఎంపికైన విద్యార్థులు టిసిఎస్, విప్రో, ఇన్ఫోసిస్, జెన్పాక్ట్, హెచ్‌జిఎస్ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు పొందాలని తెలిపారు. ఉపాధి కల్పనయే లక్ష్యంగా ఉషోదయ విద్యా సంస్థలు విద్యను అందిస్తున్నాయని కావున ప్రతి ఒక్కరూ ఈ క్యాంపస్ సెలక్షన్ సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8978616777 నెంబర్లకు కాంటాక్ట్ చేయాలని ఆయన తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ప్రిన్సిపాల్ గంగాధర్, హరికృష్ణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డైరెక్టర్ దుష్యంత్

రోడ్డుపై విరిగిపడిన చెట్లు

- తొలగించిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి


జేసీబీతో చెట్టును తొలగిస్తున్న దృశ్యం

ఎల్లారెడ్డి మండలంలో ఆదివారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో తిమ్మారెడ్డి వెళ్లుట్ల మార్గమధ్యంలో ప్రధాన రోడ్డుపై భారీ చెట్టు విరిగిపడింది. దీంతో ఆ రోడ్డుపై వెళ్లే వారికి తీవ్రమైన ఆటంకం కలిగింది. అదే సమయంలో అటువైపు నుంచి వెళ్తున్న కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డి మండలాధ్యక్షులు సాయిబాబా తక్షణమే జెసిబితో చెట్టు కొమ్మలను తొలగించేశారు. రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు. దీంతో ఆ మార్గంలో వెళ్లే ప్రయాణికులు స్థానికులు కురుమ సాయిబాబాకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు సంతోష్, కళ్యాణి గ్రామ అధ్యక్షులు సంజీవులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-రామారెడ్డి


ఎన్నికైన నూతన కమిటీ

మండల ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ సూచన మేరకు పాత కమిటీలను రద్దు చేసి నూతన కమిటీ ఏర్పాటులో భాగంగా, జిల్లా నాయకుల ఆధ్వర్యంలో అధ్యక్షునిగా ఏనగర్తి రాజ నరసయ్య, ఉపాధ్యక్షునిగా కస్తూరు సాయిలు, ప్రధాన కార్యదర్శిగా దుబ్బాక లక్ష్మీనారాయణ, కార్యదర్శి దుబ్బాక లక్ష్మణ్, మహిళా అధ్యక్షురాలుగా బాణాపురం లావణ్య ఉపాధ్యక్షురాలు ఎల్లా మానస, కార్యవర్గ సభ్యులుగా రాజశేఖర్, రమేష్, శ్రీనివాస్, కిషన్ తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ కార్యదర్శి బట్టు వెంకట్ రాములు, జిల్లా మహిళా అధ్యక్షురాలు సత్తి గారి లక్ష్మి, జిల్లా కార్యదర్శి కొత్తొల యాదగిరి తదితరులున్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని గండివేట్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో అవగాహనా సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్య భవిష్యత్తు, సైబర్ నేరాలు మొదలైన అంశాలపై విద్యార్థులకు అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గాంధారి ఎస్ఐ ఆంజనేయులు, ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు రమేష్, హెడ్ కానిస్టేబుల్ రమేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.